

కిటకిటలాడుతున్న పట్టణ రహదారి

దసరా సందడి షురూ..

జిల్లా కేంద్రంలో దసరా సందడి నెలకొంది. విజయదశమితోపాటు బతుకమ్మ, దుర్గా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం మార్కెట్ కళకళలాడింది. వ్యాపార, వాణిజ్య సముదాయాలు జనాలతో కిటకిటలాడాయి. పండగకు నూతన దుస్తులను ధరించడం, ప్రత్యేక పూజలు చేయడం సంప్రదాయం. దీంతో వేలాది మంది షాపింగ్ చేసేందుకు తరలివచ్చారు. రహదారులపై పూల విక్రయాలు చేయడం, వాహనాలను సర్వీసింగ్ చేయించుకోవడం, పండగకు ఊరెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో బస్టాండ్ కిటకిటలాడింది. అంబేడ్కర్ కూడలి, శివాజీ చౌక్, గాంధీచౌక్, దేవీచంద్‌చౌక్ రహదారుల్లో వాహనదారులు, పాదచారులతో ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయి.

- ఈనాడు ఆదిలాబాద్, న్యూస్‌టుడే ఆదిలాబాద్ అర్బన్



పూజలు చేసేందుకు ద్విచక్రవాహనాలకు వాటర్ సర్వీసింగ్ చేయిస్తున్న వాహనదారులు



ఆర్టీసీ బస్సుల కోసం వేచి చూస్తున్న జనం



జిల్లా కేంద్రం దుర్గానగర్ కాలనీలోని శ్రీనవశక్తి దుర్గా పీఠం ఆలయంలో భక్తుల పూజలు, అంతరచిత్రంలో అమ్మవారు


దుర్గమ్మకు జేజేలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని దుర్గా మందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారి అష్టోత్తరాలు పఠించారు. కొలువుదీరిన దుర్గాదేవి మండపాల్లో నిర్వాహకులు అన్నదానాలు చేశారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం



ఆదిలాబాద్‌లోని టీచర్స్ కాలనీలోని సాయిబాబా మందిరం సమీపంలో ప్రతిష్ఠించిన శారదామాత ప్రతిమ వద్ద దీపాల అలంకరణ





ఆదిలాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు

జిల్లా కేంద్రంలో బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం శ్రీనగర్ కాలనీలో మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ ఆడిపాడారు. నృత్యాలు చేసి అలరించారు. చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ అంటూ సందడి చేశారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం



రైతులకు తిప్పలు

- రుణమాఫీకి ఎదురుచూపులు

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే

రైతుల వివరాలు తప్పుగా నమోదు చేయడంతో చాలా మందికి రుణమాఫీ వర్తించలేదు. తప్పుల సవరణకు బ్యాంకుకు వెళ్తే వ్యవసాయాధికారుల దగ్గరికి వెళ్లాలని, వ్యవసాయాధికారులను కలిస్తే.. బ్యాంకులకే వెళ్లాలని చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఎంత మంది అర్హులు ఉన్నారు. ఎవరికి రుణమాఫీ కాలేదనే వివరాలు అధికారుల వద్ద లేవు. రాష్ట్రస్థాయి నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతుండటంతో తమ వద్ద వివరాలు లేవని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో రుణమాఫీకి సంబంధించిన సమస్యలు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రతోపాటు కొన్ని సహకార సంఘాల్లో ఉంది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో తప్పులు దొర్లడంతో రుణమాఫీ గందరగోళంగా మారింది.

జిల్లాలో రైతులు : 1.47 లక్షలు

బ్యాంకులో ఖాతాలున్న రైతులు: 1.35 లక్షలు

రుణమాఫీ అయిన వారు :	జమ చేసిన మాఫీ సొమ్ము :
55,961	రూ. 608.88 కోట్లు

తప్పులు సవరించాలని దరఖాస్తు చేసుకున్న రైతులు :	పేర్లు గల్లంతయిన రైతులు :	కుటుంబ నిర్ధారణ చేయాల్సిన రైతులు :
3,717	2 వేల మంది	16,642

రూ.2 లక్షలకుపైగా రుణం ఉన్న వారు : 47,000

జిల్లాలో మూడు విడతలో ప్రభుత్వం రుణమాఫీ చేసింది. ఇందులో భాగంగా 55,961 మంది రైతులకు రూ. 608.88 కోట్లు మాఫీ సొమ్మును వారి ఖాతాల్లో నేరుగా జమ చేసింది. బ్యాంకుల తప్పిదాలతోపాటు ఆధార్, పట్టాపాసుపుస్తకాలు, కుటుంబ నిర్ధారణ తదితర వాటితో చాలా మందికి మాఫీ సొమ్ము జమ కాలేదు. మాఫీ సొమ్ము జమ కాని రైతులు మండల కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. జిల్లా మొత్తంలో 3,717 మంది రైతులు మాఫీ సొమ్ము రాలేదని దరఖాస్తు చేసుకొని 15 రోజులు గడిచినా వాటికి అతీగతి లేదు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలోనే ఎక్కువ

రుణమాఫీకి సంబంధించి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో చాలా మంది రైతులకు రుణమాఫీ సొమ్ము జమ కాలేదు. జైనథ్, తలమడుగు, గుడిహత్నూర్, ఆదిలాబాద్ టౌన్, గిమ్మలో ఈ బ్యాంకు శాఖలున్నాయి. ఆయా బ్యాంకుల నుంచి 7,500 మంది రుణమాఫీకి అర్హులు కాగా కేవలం 2 వేల మందికి మాత్రమే మాఫీ సొమ్ము జమ అయింది. అందులో 800 మందికి పైగా రైతులకు తక్కువ మొత్తం మాఫీ సొమ్ము జమ అయింది. కొంత మంది పేర్లు అయితే బ్యాంకులు పంపించిన జాబితాలో లేకపోవడంతో రైతులు మండిపడుతున్నారు. తప్పులను సవరించి రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల జిల్లా పాలనాధికారిని కలిసి రైతులు మొరపెట్టుకున్నారు.



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎదుట రైతులు



జైనథ్‌కు చెందిన తక్కల రాజీవ్ అనే రైతు జైనథ్ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రూ.1.80 లక్షలు పంట రుణం తీసుకోగా రుణమాఫీ కింద రూ.37 వేలు మాత్రమే జమ అయింది.



తలమడుగుకు చెందిన మంతెన సత్యపాల్‌కు రూ.92 వేలు రుణమాఫీ సొమ్ము జమ కావాల్సి ఉండగా రూ.52 వేలు జమ అయింది. మిగిలిన సొమ్ము కోసం తిరిగి దరఖాస్తు చేసుకున్నాడు.



జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామానికి చెందిన మార పార్వతిబాయికి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నుంచి రూ.1.22 లక్షలు రుణ మాఫీ కావాల్సి ఉంది. రుణమాఫీ జాబితాలో ఆయన పేరు లేదు. ఇప్పటికే నాలుగుసార్లు బ్యాంకులో, వ్యవసాయాధికారులకు దరఖాస్తు ఇచ్చారు.

ఎన్‌హెచ్‌ఏఐపై వాల్టా చట్టం కింద కేసులు నమోదు

ఎదులాపురం, న్యూస్‌టుడే: జాతీయ రహదారుల ప్రాధికార సంస్థపై ఆదిలాబాద్ జిల్లాలో వాల్టా చట్టం కింద కేసులను అటవీ అధికారులు గురువారం నమోదు చేశారు. ఇచ్చోడ అటవీ రేంజ్ పరిధిలోని దుబార్‌పేట్ వద్ద వంతెన నిర్మాణం, ఆదిలాబాద్ రేంజ్ పరిధిలోని బోరజ్ వద్ద సర్వీసు రోడ్డు నిర్మాణంలో భాగంగా ఆ సంస్థ అటవీశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రహదారి పక్కనున్న చెట్లను పడగొడుతున్నందుకు వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేశారు. రెండు ప్రాంతాల్లో చెట్లను నరికి వేస్తున్నందుకు జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌పై అరెస్టు వారెంట్ జారీ చేసి కోర్టులో హాజరుపర్చాలని ఇచ్చోడ, ఆదిలాబాద్ రేంజ్ అధికారులను జిల్లా అటవీ అధికారి ప్రశాంత్‌బాజీరావు పాటిల్ ఆదేశించారు. ఈ మేరకు కేసులు నమోదు చేశారు.



అంకోలి పీహెచ్‌సీలో కాల్చివేస్తున్న మందులు, వ్యర్థాలు

కాలం చెల్లిన మందులు కాల్చేస్తున్నారు!

ఆదిలాబాద్ గ్రామీణ మండలం అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాలం చెల్లిన మందులను నిర్లక్ష్యంగా కాల్చేస్తున్నారు. మందులు, ఓఆర్ఎస్ పొట్లాలు, సిరంజీలు, తదితర వ్యర్థాలను పీహెచ్‌సీ ఆవరణలో మంటల్లో వేసి నిప్పు పెడుతున్నారు. ఆ మంటల నుంచి వెలువడే పొగ ప్రమాదకరంగా ఉండటంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఆసుపత్రిని ఆనుకొని ప్రభుత్వ పాఠశాలలు, ఆలయం, ఇతర దుకాణాలు ఉన్నాయి. మందులతోపాటు ఇతర చెత్త, చెదారాలను సైతం ఆవరణలో పడేస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం**

దసరా.. లక్ష్యసాధనకు బాటలు.. అగ్రగామి గెలుపు బావుటా..

పాండవులు కౌరవులపై, శ్రీరాముడు రావణుడిపై, అమ్మవారు రాక్షసులపై విజయం సాధించిన సందర్భంగా విజయదశమి పండగను జరుపుకొంటుంటాం. ఈ పండగ విజయానికి ప్రతీక.. ప్రతిఒక్కరూ తాము నిర్దేశించుకున్న లక్ష్యంకోసం అహర్నిశలు శ్రమిస్తూ... కొత్త ఉత్సాహంతో ముందుకు సాగితే విజయం మనదే అవుతుంది. జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు వివిధ ఉద్యోగ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఏర్పరచుకున్న లక్ష్యం వైపు ఈ రోజు నుంచే అడుగులు వేసి విజయతీరాలకు చేరుకోవాలి. యువత, మహిళలు, విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరూ తాము కన్న కలలను సాకారం చేసుకునేందుకు ముందుకు సాగాలి.

● నేడు విజయదశమి





దండేపల్లి, న్యూస్‌టుడే

ఆర్థిక సాధికారత దిశగా..

ఉమ్మడి జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 1,926
స్వయం సహాయక సంఘాలు: 41,998
సభ్యులు: 4.25 లక్షలు

మహిళలు ఆర్థిక సాధికారత సాధించిననాడే ఆ కుటుంబాలు మరింత అభివృద్ధి చెందుతాయి. గ్రామీణ పేదరిక నిర్మూలన పథకంలో ఇందిరా మహిళా శక్తి, బ్యాంకు లింకేజీ ద్వారా స్వయం సహాయక మహిళలకు ప్రభుత్వం రుణాలు అందిస్తోంది. దీంతో పాటు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తూ ఆదాయం పొందుతూ సంఘాలను పటిష్ఠం చేసుకుంటున్నారు. కుటుంబ పరిశ్రమలు, సాంకేతిక పరంగా కంప్యూటర్, ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ తదితర రంగాల్లో ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకుని మరింత ముందుకు సాగాలి...

విద్యార్థీ విజయోస్తు..

ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు: 126
విద్యార్థులు: 46,000
పాఠశాలలు: 4,779
విద్యార్థులు: 4.80లక్షలు



విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం గురుకులాలు, ఇలా ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నారు. మార్చి నుంచి ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలి.

కలలు కని.. సాకారం చేసుకుని

ఉపాధ్యాయులు కావాలని కలలు కన్నారు. సంవత్సరాల తరబడి సాధన చేశారు. కలలు సాకారం చేసుకున్నారు. అనుకున్నది సాధించారు. త్వరలోనే బడుల్లో చేరి పాఠాలు బోధించనున్నారు. ఇటీవల జరిగిన డీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా నుంచి స్కూల్ అసిస్టెంట్లు, భాషోపాధ్యాయులు, ఎస్జీటీలుగా వంద లాది మంది ఎంపికై నియామక పత్రాలు తీసుకున్నారు. వీరంతా రాత్రనక, పగలనక, ఇళ్లలో, గ్రంథాలయాల్లో, శిక్షణ కేంద్రాల్లో సాధన చేశారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని అభ్యర్థులు మరింత ఆత్మవిశ్వాసంతో, పట్టుదలతో ముందుకు సాగి కొలువులు సాధించాలి..



ఆదిలాబాద్ జిల్లాలో ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థుల్లో కొందరు..

డీఎస్సీలో కొలువుల ఇలా..
భర్తీ చేయనున్న పోస్టులు (అన్ని కేడర్లలో)

ఆదిలాబాద్	266
కుమురంభీం	270
మంచిర్యాల	288
నిర్మల్	278

గురిపెడితే గ్రూప్ విజేతవే..

ఈ నెల 21 నుంచి మొదలు డిసెంబరు వరకు గ్రూప్-1, గ్రూప్-3, గ్రూప్-2 పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సమయం సద్వినియోగం చేసుకుంటే సాధన చేస్తే సర్కారు కొలువు సాధించవచ్చు. ఆ దిశగా ముందుకు సాగాల్సిన అవసరముంది. రాష్ట్రవ్యాప్తంగా 563 గ్రూప్-1 ఉద్యోగాలకు గతంలోనే ప్రిలిమ్స్ పరీక్షలు పూర్తయి ఫలితాలు రావడంతో ఈ నెల 21 నుంచి మెయిన్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో 18,213 మంది అభ్యర్థులు ప్రిలిమ్స్ పరీక్షలు రాయగా 10 వేల మంది మెయిన్‌కు అర్హత సాధించారు. దీంతోపాటు ఇప్పటికే గ్రూప్-2లో రాష్ట్రవ్యాప్తంగా 783 పోస్టులు ఉండగా ఉమ్మడి జిల్లాలో 26 వేల మంది పరీక్ష రాసేందుకు సాధన చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరు 15 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గ్రూప్- 3 పోస్టులకు ఈ ఏడాది నవంబరు 15, 16 తేదీల్లో పరీక్షలు జరగనుండగా జిల్లా నుంచి 14 వేల మంది పరీక్ష రాయనున్నారు. ఇవే కాకుండా నేవీ, ఆర్మీ, రైల్వే, బ్యాంకు ఉద్యోగాలకు డిసెంబరులోగా పరీక్షలు జరగనున్నాయి.



ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకుంటున్న ఉద్యోగార్థులు

మొక్కవోని దీక్షతో..



ఈమె పేరు మామిడాల వనిత. మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి గ్రామం. పేద కుటుంబం. భర్త జనార్దన్ ప్రైవేటు ఉద్యోగి. ఈమెకు రెండేళ్ల బాబు ఉన్నాడు. ఉద్యోగ సాధనే లక్ష్యంగా ఒక వైపు బాబును చూసుకుంటూనే మరో వైపు ఆత్మవిశ్వాసంతో కృషి చేసింది.. ఏడాది నుంచి ఇంటి వద్దనే కష్టపడుతూ డీఎస్సీలో 47వ ర్యాంకుతో కొలువు సాధించింది..

డిజీలాకర్.. ధ్రువపత్రాలు భద్రం..

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే:

ఉద్యోగాలు, ప్రవేశాలకు వివిధ ధ్రువపత్రాలు తప్పనిసరి. ఆ సమయంలో హడావుడిలో ఏదో ఒకటి మరచిపోతుంటాం. వెనక్కి వెళ్లలేక అధికారులను బతిమాలుకుంటారు. వారు అనుమతి ఇవ్వకపోతే అవకాశం చేజారుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు అందుబాటులోకి వచ్చిన డిజిటల్ వ్యవస్థ దోహదపడుతుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సురక్షిత డిజీలాకర్ యాప్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. పాస్‌పోర్టు దరఖాస్తులకు డీజీలాకర్‌లోని పత్రాల వినియోగానికి అనుమతి ఇస్తుండటం గమనార్హం..

అనుసంధానం..

డిజీలాకర్‌కు అనుసంధానమైన ప్రభుత్వ శాఖల పత్రాలను భద్రపరుచుకోవచ్చు. ఇందుకు ఆయా పత్రాల రిజిస్ట్రేషన్ సంఖ్య నమోదు చేస్తే సరిపోతుంది. అవన్నీ తెరపై కనిపిస్తాయి. ఒకవేళ అనుసంధానం కాకపోతే స్కాన్ చేసి భద్రపరుచుకోవచ్చు. ఇందుకు 1 జీబీ స్టోరేజీ సామర్థ్యం ఉంటుంది. ప్లాట్‌ఫాం ధ్రువపత్రాల సమర్పణకు యూఆర్ఎల్ లింకు పంపించడానికి కొన్ని సంస్థలు కూడా అనుమతిస్తాయి.



డిజీలాకర్ యాప్ ముఖచిత్రం

ఏయే పత్రాలు అంటే..

ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, కుల, ఆదాయ, జనన ధ్రువపత్రాలు, ఆస్తులకు సంబంధించినవి, రేషన్‌కార్డు, బీమా పత్రాలు, ఓటరు కార్డు, తదితర పత్రాలను భద్రపరుచుకోవచ్చు. డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు వంటి పత్రాలను దగ్గర ఉంచుకునే బదులు ప్రభుత్వ అధీకృత యాప్‌లో భద్రపరుచుకుంటే మన సమాచారం సురక్షితంగా ఉంటుంది. డిజీలాకర్‌లో చేరగానే పదోతరగతి మొదలుకొని ఆపై తరగతుల పత్రాలను జతచేయాలి

ఏం చేయాలంటే..

ముందుగానే స్మార్ట్ ఫోన్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి డిజీ లాకర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి. దానిని ఓపెన్ చేసి పేరు, పుట్టిన తేదీ, ఈ-మెయిల్, ఫోన్ నంబరు నమోదు చేయాలి. ఆరు అంకెల పాస్‌వర్డ్ ఇవ్వాల్సి ఉంటుంది. చరవాణికి వచ్చిన ఓటీపీని నమోదు చేస్తే ఖాతా తెరుచుకుంటుంది. ఆ తర్వాత యాప్‌లో పాన్‌కార్డు, ఆధార్, పది, ఇంటర్, డిగ్రీ ధ్రువపత్రాలజాబితా కనిపిస్తాయి. అందులో మనకు కావాల్సింది ఎంచుకొని అడిగిన మేర వివరాలు నమోదు చేయాలి.

ప్రతిభ చాటి.. ప్రేరణలో మెరిసి

● జాతీయ సదస్సుకు ఆదిలాబాద్ విద్యార్థుల ఎంపిక
● నేడు గుజరాత్‌కు పయనం

వ్యవసాయ కూలీ బిడ్డ



ఆదిలాబాద్ పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీ సట్లవార్ జ్యోతి కుమారుడు హర్ష్ బంగారుగూడ ఆదర్శ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. తండ్రి సంజయ్ అనారోగ్యంతో చనిపోయాడు. అమ్మ ఆశలు నెరవేర్చే దిశగా వికసిత్ భారత్ పోటీల్లో ప్రతిభ చాటాడు. జిల్లాలోని ప్రదేశాలను చూడని తాను ఏకంగా గుజరాత్‌లో ఏడు రోజులపాటు జరిగే సదస్సుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

జిల్లా గురించి గర్వంగా చెబుతా..



ఆదిలాబాద్ పట్టణం శాంతినగర్‌కు చెందిన గుండావార్ మహేష్-శీతల్ దంపతుల కూతురు అక్షర ప్రేరణ జాతీయ సదస్సుకు ఎంపికయ్యారు. పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న తాను సదస్సులో జిల్లా గురించి గర్వంగా చెబుతానని అక్షర చెబుతోంది.

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే:

వికసిత్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో చిన్ననాటి నుంచి జాతీయతభావం పెంపొందించేలా 'ప్రేరణ ఉత్సవ్' పేరిట కార్యక్రమం నిర్వహిస్తోంది. జిల్లాస్థాయిలో వివిధ పోటీలు నిర్వహించి ఆ పోటీల్లో ప్రతిభ కనబర్చినవారిని జాతీయస్థాయి సదస్సుకు ఎంపిక చేసింది. జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. గైడ్ టీచరుతో కలిసి వారిద్దరు శనివారం గుజరాత్ రాష్ట్రంలోని వాడ్‌నగర్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

విద్యార్థులకు దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, దేశం కోసం ఏం చేయాలనే లక్ష్యాలను నిర్దేశించేలా కేంద్రం 'ప్రేరణ ఉత్సవ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఏప్రిల్‌లో అన్ని పాఠశాలల నుంచి ప్రతిభ ఉన్న ఇద్దరు విద్యార్థుల చొప్పున ఆదిలాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయంలో 70 మందికి ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభకనబర్చిన వారిని ముఖాముఖి ద్వారా జాతీయ సదస్సుకు ఎంపిక చేశారు. అలా బంగారుగూడ ఆదర్శ పాఠశాల విద్యార్థి సట్లవార్ హర్ష్, లిటిల్‌ఫ్లవర్ విద్యార్థిని గుండావార్ అక్షర ఎంపికయ్యారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రం మేహసన జిల్లా వాడ్‌నగర్ కేంద్రీయ విద్యాలయంలో జాతీయ సదస్సు జరగనుంది. ఏడు రోజులపాటు స్వాభిమాన్, ధైర్య సాహసాలు, భిన్నత్వంలో ఏకత్వం, సత్య నిష్ఠ, నిజాయితీ-నాయకత్వం, సాంకేతిక, విశ్వసనీయత, స్వేచ్ఛ-కర్తవ్యం, దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలు వంటి అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. చారిత్రక ప్రదేశాలను చూపించనున్నారు. తెలుగు రాష్ట్రాల విద్యార్థులతోపాటు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, అసోం, ఒడిశా, బిహార్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల విద్యార్థులతో కలిసి జిల్లా విద్యార్థులు సదస్సులో పాల్గొననున్నారు. సదస్సులో నిర్వహించే ప్రతిభా పోటీల్లో ఎంపికైతే జనవరి 26న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారం ఇవ్వనున్నారు.

ప్రతినబూనితే.. ప్రగతి ప్రస్థానమే



ఈటీవీ ఆదిలాబాద్ :

● ఉమ్మడిజిల్లాకు అపార అవకాశాలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సహజ సిద్ధమైన వనరులు సద్వినియోగమయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కంకణబద్ధులై ఆలోచిస్తే జిల్లా విజేతగా నిలుస్తోంది. విజయదశమి సందర్భంగా ఇక్కడున్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని ప్రతిన బూనితే ఉమ్మడి జిల్లా విజయ ప్రస్థానానికి అడ్డే ఉండదు..

అధికారుల పాత్ర

నిజాం ఏలుబడిలో మానవ పరిణామ శాస్త్రవేత్తగా వచ్చిన ఇంగ్లాండ్‌కు చెందిన హైమన్‌డార్ఫ్ మనసును గెల్చుకున్న ఉమ్మడి జిల్లా ప్రజానీకం సేవాగుణంతో పని చేసిన అధికారులను ఎప్పుడూ మర్చిపోలేదు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థికశాఖ కమిషనర్ రామకృష్ణారావుతోపాటు అహ్మద్‌బాబు, జ్యోతిబుద్ధ ప్రకాశ్, దివ్య దేవరాజన్‌లను గుర్తు చేసుకుంటారు. విధి నిర్వహణను పరమావధిగా భావిస్తూ ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా నేటి అధికారులు పని చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. జిల్లా ఖ్యాతి ఇనుమడిస్తుంది.

చేయాల్సిందేమిటి



కడెం, సాత్నాల, మత్తడివాగు, గడ్డెన్నవాగు, స్వర్ణ, ఎల్లంపల్లి జలాశయాలను ఆధునికీకరిస్తే ప్రతీ ఎకరానికి నీరివ్వచ్చు. రెండు పంటలు పండించడానికి ఆస్కారం ఏర్పడుతుంది. మారుతున్న సమాజానికి అనుగుణంగా అటవీ ఉత్పత్తుల వినియోగంలో ఉట్నూరు ఐటీడీఏ, గిరిజన కో-ఆపరేటివ్ సొసైటీ(జీసీసీ)లను ప్రక్షాళన చేస్తే ఆదివాసీ, గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేసినట్లే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తే ఉమ్మడి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపవచ్చు.

మనకున్నదేంటి



ఉమ్మడి జిల్లా 16,203 చదరపు కిలోమీటర్లతో విస్తరించి ఉంది. ఒకప్పుడు 40 శాతం అటవీ ప్రాంతముంటే ప్రస్తుతం 27 శాతానికి పరిమితమైంది. దాదాపు 28 లక్షల జనాభా ఉండగా మాంగనీసు, బొగ్గు, సున్నపు రాయి ఖనిజ సంపద కలిగి ఉంది. పత్తి పంటకు ప్రసిద్ధి పొందింది. ఉమ్మడి రాష్ట్రంలో సోయా సాగుకు పేరెన్నికగన్నది. కూరగాయలు, మిరప, నువ్వులు, పసుపు, వరి పంటలకు అనుకూలంగా ఉంది. జీవనదులు గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగ సహా వాగులు, సెలయేళ్లకు కొదువలేదు.

నేతల చొరవ



గోండు వీరుడు కుమురం భీం, స్వాతంత్ర్య తొలితరం నేతలైన వన్నెల ఎల్లన్న, దాజీ శంకర్, కస్తాల రాంకిషన్, కొండా లక్ష్మణ్ బాపూజీ, సామల సదాశివలాంటి వారి త్యాగనిరత అమోఘమైనది. జోడేఘాట్, ఇంద్రవెల్లి పోరాట పటిమ ఉద్యమ చరిత్రను చాటేదే. ఆ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజాప్రతినిధులు పక్షపాతం లేకుండా ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగితే ఉమ్మడి జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడనిదేం కాదు. బాసర ఆర్జీయూకేటీకి అనుబంధంగా మరో విశ్వవిద్యాలయం సహా జిల్లాకో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు, నాలుగు వైద్య కళాశాలలను బలోపేతం చేస్తే విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో జిల్లా అగ్రస్థానంలో నిలుస్తుంది. కవ్వాల్ అభయారణ్యం, కుంటాల, గాయత్రి, పొచ్చెర ప్రాశస్త్యాన్ని గుర్తించి అభివృద్ధి చేస్తే పర్యాటక రంగంలో కొత్త శోభ సంతరించుకుంటుంది.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు తృతీయస్థానం



పతకం, ప్రశంసాపత్రాలతో ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్ క్రీడాకారిణులు

మంచిర్యాల క్రీడావిభాగం, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : రంగారెడ్డి జిల్లా తొర్రూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళల హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ప్రతిభచాటి తృతీయ స్థానంలో నిలిచినట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనే శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్‌లు తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు 53వ సీనియర్ పురుషులు, మహిళల రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు జరిగినట్లు చెప్పారు. మూడో స్థానంలో నిలిచిన జట్టును, దానికి సారథిగా వ్యవహరించిన రమ్య, శిక్షకులు అరవింద్, కల్యాణ్‌లను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు అభినందించారు.

మూసివేత దిశలో.. ప్రైవేటు డిగ్రీ కళాశాలలు

● ఫీజుల చెల్లింపులో ప్రభుత్వ తాత్సార ఫలితం

ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మూసివేత దిశగా పయనిస్తున్నాయి. మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి బకాయిలు రాకపోవడంతో విద్యాసంస్థలను యజమానులు నిర్వహించలేని స్థితికి చేరుకున్నారు. తక్షణం నిధులు విడుదల చేస్తే తప్ప తాము ముందుకెళ్లలేమని భీష్మించుకు కూర్చున్నారు. ఈ క్రమంలో దసరా సెలవుల తర్వాత కళాశాలలు తెరవబోమని స్పష్టంచేస్తూ యూనివర్సిటీ అధికారులు, ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేస్తున్నారు. -న్యూస్‌టుడే, నిర్మల్ పట్టణం



కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘు బాధ్యులు

ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు: సుమారు 94

రావాల్సిన బకాయిలు: దాదాపు రూ.60 కోట్లకు పైగానే..

ఉద్దేశం ఇదీ..

ఆర్థిక కారణాలతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కావొద్దనే లక్ష్యంతో 2008లో అప్పటి ప్రభుత్వం బోధనా రుసుముల చెల్లింపు పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రైవేటులో చదివే విద్యార్థులకు వారి కోర్సుల రుసుములు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఇది రెండు రకాలు. మొదటిది ఎంటీఎఫ్- మెయింటెనెన్స్ ఆఫ్ ట్యూషన్ ఫీ (విద్యార్థుల మెస్‌ఛార్జిల కోసం.. ఇది విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లో జమవుతుంది), రెండోది ఆర్‌టీఎఫ్- రీఎంబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీ (కళాశాలలకు చెల్లించేది, ఇది యాజమాన్య ఖాతాల్లో జమవుతుంది). మొదట్లో నిర్ణీత సమయంలోనే విద్యార్థులకు, కళాశాల యాజమాన్యాలకు ఉపకార వేతన రుసుముల చెల్లింపులు జరిగేవి. కానీ, ఇప్పుడా పరిస్థితి లేదు. సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఈ ప్రక్రియకు తొలి ఆటంకం ఏర్పడింది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం పరిస్థితి మరింత దయనీయంగా మారింది. విద్యార్థులను ఫీజులు అడగలేక, ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు పొందలేక, భవన అద్దె, జీతభత్యాలు, నిర్వహణ వ్యయం.. ఇవన్నీ భరించలేక, అప్పులు చేయడం, వాటికి వడ్డీలు చెల్లించలేక చివరకు మూసేస్తామని ప్రభుత్వానికి నివేదించే స్థాయికి ప్రైవేటు డిగ్రీ కళాశాలలు చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇప్పటికే కొన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మూతబడగా, మరి కొన్ని అదే దారిలో పయనిస్తున్నాయి.

హైకోర్టులో పిల్ దాఖలు చేశాం:

నంగె శ్రీనివాస్, ప్రిన్సిపల్, త్రిదేవి డిగ్రీ కళాశాల, నేరడిగొండ

దాదాపు పదేళ్లుగా అస్తవ్యస్తమై, మూడేళ్లుగా ఉపకార వేతన రుసుముల చెల్లింపులు లేక ప్రైవేటు డిగ్రీ కళాశాలల నిర్వహణ భారమైంది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు ఎన్నోమార్లు విన్నవించాం. అయినా ఫలితం లేకపోయింది. దీంతో కళాశాలలు మూసేసే పరిస్థితి వచ్చింది. ఇక చేసేదేంలేక ప్రభుత్వంపై న్యాయ పోరాటానికి సిద్ధమయ్యాం. తాజాగా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశాం. పండగ తర్వాత విచారణ మొదలు కానుంది.

ఆందోళన బాటలో..

నిధులు విడుదల చేయాలని విద్యార్థులు, యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. డబ్బుల్లేక నిర్వహణ భారంగా మారుతోందని కళాశాలలు వాపోతుండగా, ప్రభుత్వంపై ఆధారపడి ప్రవేశాలు పొందిన తమ పిల్లల చదువులు కొనసాగించలేక, ఫీజులు చెల్లించలేక, పై చదువులకు వెళ్లే అవకాశాన్ని కోల్పోతున్నారని పోషకులు ఆవేదన చెందుతున్నారు. విద్యార్థుల నుంచి రుసుములు వసూలుకు ఒత్తిడిచేస్తే ఆ కళాశాలలను బ్లాక్‌లిస్టులో చేర్చాలంటూ ఉన్నతవిద్యా మండలి అధికారులు ఆదేశిస్తుండటంతో నిస్సహాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

నేటితో ముగియనున్న నవరాత్రి ఉత్సవాలు



సిద్ధిధాత్రి రూపంలో అమ్మవారు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగియనున్నాయి. తొమ్మిది రోజుల క్రితం ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. అమ్మవారు సిద్ధిధాత్రి రూపంలో దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. సరస్వతి దీక్షలు తీసుకున్న భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేదపండితులు చండీయాగం ప్రారంభించారు. గణపతి పూజ, మండపారాధన, స్థాపిత దేవతాహవనం, తదితర పూజలు చేశారు. శనివారంతో నవరాత్రి ఉత్సవాలు ముగియనుండటంతో వేకువజామున నుంచి చండీహోమం, మహాపూర్ణాహుతి ఉంటుందని, అమ్మవారి అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం ఉంటుందని ఆలయాధికారులు తెలిపారు.

తెలంగాణ అంతటా సింగరేణి వెలుగులు



ఇందారంలోని ఐకేఏ గని సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

భీమారం: తెలంగాణ అంతటా వెలుగులు నింపే శక్తిగా సింగరేణి నిలిచిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. జైపూర్ మండలం ఇందారంలోని ఐకే-1ఏ గనిపై శుక్రవారం జరిగిన ఉజ్వల సింగరేణి- ఉద్యోగుల పాత్ర సమావేశానికి ఆయన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ గతంలో నష్టాల్లో ఉన్నప్పుడు అప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్న కాకా చొరవతో అప్పుల భారం నుంచి లాభాల్లోకి వెళ్లిందన్నారు. ఈ ఏడాది తొలిసారి కాంట్రాక్టు కార్మికులకు లాభాలలో వాటా అందజేశారన్నారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులతో ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం చాలా గొప్ప విషయమని అన్నారు. జైపూర్‌లోని ఎస్టీపీపీలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్టీపీపీ ప్రారంభమైన 3 ఏళ్లలోనే జాతీయస్థాయి ఉత్తమ పవర్ జనరేషన్ సంస్థగా అవార్డు సాధించడం గొప్ప విషయమని అన్నారు. త్వరలోనే మరో 800 మెగావాట్ల యూనిట్ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానికులకు, భూమిని కోల్పోయిన నిర్వాసితులకు సంస్థలో ఉద్యోగావకాశాలు త్వరగా కల్పించాలని జీఎంకు సూచించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఎస్టీపీపీ ఈడీ ఎన్వీ. రాజశేఖర్, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, డీజీఎం వెంకటేశ్వర్లు, ఎస్టీపీపీ జీఎంలు శ్రీనివాసులు, సముద్రాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

సిరికొండ, న్యూస్‌టుడే:

? సిరికొండలోని తహసీల్దార్ కార్యాలయం ముందు వెళ్లే కాలనీకి వెళ్లే మార్గంలో డ్రైనేజీ నిర్మించారు. పైకప్పు వేయకపోవడంతో కాలనీకి రాకపోకలు సాగడం ఇబ్బందిగా మారింది. - స్థానికుడు, సిరికొండ

✔ ఈ సమస్యను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం - అరుణ్, పంచాయతీ కార్యదర్శి

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

? ఆదిలాబాద్ పట్టణంలోని టైలర్స్ కాలనీలో ఓ వీధిలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతుంటే మరో వీధిలో రాత్రిపూట దీపాలు వెలగక చీకట్లో ఇబ్బందులు పడుతున్నాం. - రాజేశ్వర్, కాలనీవాసి

✔ సిబ్బందిని పంపించి వీధిదీపాలు చెడిపోతే కొత్తవి ఏర్పాటు చేస్తాం. పగలు వీధిదీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం. - తిరుపతి, డీఈఈ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

సాగర్ మార్కెట్‌లో చోరీ.. ఇంటి దొంగ పనే

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 7వ తేదీన వెలుగు చూసిన సాగర్ సూపర్ మార్కెట్‌లో చోరీ కేసును పోలీసులు కేవలం నాలుగు రోజుల వ్యవధిలో ఛేదించారు. అందులో గోదాం ఇన్‌ఛార్జిగా పని చేసే వ్యక్తే చోరీకి పాల్పడ్డట్లు గుర్తించారు. ఈ మేరకు వివరాలను డీఎస్పీ జీవన్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు. సాగర్ సూపర్ మార్కెట్‌లో అయిదేళ్లుగా నమ్మకంగా పని చేస్తున్న ఇచ్చోడ మండలం సుంకిడికి చెందిన చౌహాన్ సుప్రభాత్ దుర్బుద్ధితో చోరీకి పాల్పడ్డట్లు దర్యాప్తులో తేల్చారు. ఈ నెల 6న సిబ్బంది వెళ్లిపోగా చౌహాన్ సుప్రభాత్ వెళ్లకుండా అందులో దాక్కున్నాడు. అనంతరం ముఖానికి ముసుగు వేసుకొని సూపర్ మార్కెట్‌లోని పది కౌంటర్లలో ఉన్న రూ.3.05 లక్షలను చోరీ చేసి లిఫ్ట్ ద్వారా భవనం పైకెక్కి మురుగు నీటి పైపు ద్వారా పరారయ్యాడు. డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామీణ సీఐ ఫణీధర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, మావల ఎస్ఐ వంగ విష్ణువర్ధన్, ఐడీ పోలీసులు నరేష్, కరీం, సతీష్, రమణలు సీసీపుటేజీల ఆధారంగా కేసు ఛేదించారు. చోరీ చేసిన నగదుతో నిందితుడు శుక్రవారం రాంనగర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు వద్ద ఉండగా అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి రూ.3.05 లక్షల నగదు, ఒక ద్విచక్రవాహనం, చరవాణి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇచ్చోడ, న్యూస్‌టుడే : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఇచ్చోడకు చెందిన లక్కె కైలాష్ అనుమతి లేకుండా 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. తన బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న క్రమంలో పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ నయాబ్ తహసీల్దార్ రామారావు ఉన్నారు.

నిమజ్జనాలు.. కుంకుమార్చనలు

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా ఆయా చోట్ల ప్రతిష్ఠించిన దుర్గామాతలను శుక్రవారం దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బోథ్‌లోని దుర్గామాత వద్ద ఎంపీ గోడం నగేష్ ప్రత్యేక పూజలు చేశారు. - న్యూస్‌టుడే, బృందం



బోథ్‌లో దుర్గామాత విగ్రహం వద్ద ఎంపీ గోడం నగేష్


సొనాలలో దుర్గాదేవి నిమజ్జనంలో డోలు వాయిద్యాల సందడి


బేల: మహంకాళీ మాత ఆలయం వద్ద భక్తుల పూజలు


బుగ్గారాం(బి)లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


ఆదిలాబాద్ : దుర్గామాత విగ్రహం వద్ద జోగురామన్న దంపతుల పూజలు


ఆదిలాబాద్‌లో దుర్గాదేవీ ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు


బజార్‌హత్నూర్‌లో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

మాజీ మంత్రి దసరా శుభాకాంక్షలు

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు మాజీ మంత్రి జోగు రామన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆనందోత్సాహాల మధ్య పండగ నిర్వహించుకోవాలన్నారు.

19న కుమురం భీం విగ్రహావిష్కరణ

ఉట్నూరు, న్యూస్‌టుడే : మండలంలోని తాటిగూడ గ్రామంలో ఈ నెల 19న కుమురం భీం విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పేర్కొన్నారు. శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

మద్యం గొలుసు దుకాణాలు గ్రామం బయట నిర్వహించాలి

బోథ్, న్యూస్‌టుడే: బోథ్‌లో మద్యం గొలుసు దుకాణాలను గ్రామం బయట నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేష్ డిమాండ్ చేశారు. బోథ్‌లో శుక్రవారం తహసీల్దార్ సుభాష్ చంద్ర, ఎస్ఐ ప్రవీణ్‌లకు ఆయన వినతిపత్రం అందజేశారు.

ఇంద్రాయి ఆలయ భూమిపై సర్వే చేయాలి

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఇంద్రాయి ఆలయ భూమిపై రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయి సర్వే చేయాలని మెస్రం వంశస్థులతోపాటు కేస్లాపూర్, వడ్‌గాం రాయిసెంటర్‌ల సార్‌మెడిలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇంద్రాయి దేవత పూజలకు వచ్చిన సందర్భంగా ఆలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సార్‌మెడిలు మెస్రం వెంకట్‌రావు, మెస్రం చిన్ను పటేల్, పూజారి మెస్రం కోసులతోపాటు పలువురు మాట్లాడుతూ ఇంద్రాయి దేవత ఆలయానికి వచ్చేందుకు దారి లేకుండా ఆక్రమణలు చేస్తున్నారన్నారు. ఈ ఆలయానికి గతంలో 7.18 గుంటల భూమి ఉండేదని, ఆ భూమి ఆక్రమణకు గురి అయిందని ఆరోపించారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలి

బోథ్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. బోథ్‌లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రవితేజ, పూలాసింగ్‌నాయక్ తండా గ్రామానికి చెందిన రాథోడ్ భాస్కర్ అనే రైతుల కుటుంబ


కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుంటున్న రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొర్రన్న

సభ్యుల వివరాలను శుక్రవారం అడిగి తెలుసుకున్నారు. ఆకుకూరలు, చిరుధాన్యాలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థులు సురేందర్, రఘువంశీ, సురేష్, యువరాజ్ ఉన్నారు.


తాంసి వ్యవసాయ ఉప మార్కెట్ యార్డులో సోయా కొనుగోళ్లను పరిశీలిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి

వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించొద్దు

తాంసి, న్యూస్‌టుడే : తాంసి వ్యవసాయ ఉప మార్కెట్ యార్డులో కొనసాగుతున్న సోయా కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి తనిఖీ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. తూకం యంత్రాలను పరిశీలించారు. వ్యాపారులకు తక్కువ ధరకు పంటను విక్రయించకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకోవాలన్నారు. తేమశాతం, తుక్కు లేకుండా పంటను తీసుకురావాలని సూచించారు. సీఈఓలు కేశవ్, దత్తు, రాంరెడ్డి, కార్యదర్శులు సుధాకర్, సిద్ధూ తదితరులున్నారు.

14 వరకు నిలిపివేత

తాంసి: అకాల వర్షాలు, దసరా సందర్భంగా తాంసిలో సోయా కొనుగోళ్లను ఈ నెల 14 వరకు నిలిపివేసినట్లు సహకార సంఘం సీఈఓ కేశవ్ శుక్రవారం తెలిపారు. తాంసి, భీంపూర్, తలమడుగు మండలాల రైతులు సహకరించాలన్నారు.


కేక్ కోస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

ఘనంగా ఎస్పీ జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: జిల్లా ఎస్పీ గౌష్ ఆలం జన్మదిన వేడుకలను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డీఎస్పీలు జీవన్‌రెడ్డి, హబీబ్‌ఉల్లా, పోతారం శ్రీనివాస్, సీఐలు కరుణాకర్ రావు, సునిల్‌కుమార్, ప్రణయ్‌కుమార్, పోలీసులు పాల్గొని ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజేందర్, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రైతుల కష్టం తెలుసుకుని.. నియంత్రిక బిగించి..


గిరిగామ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక వద్ద డీఈ హరికృష్ణ, ఏఈ మనోజ్‌కుమార్

తాంసి మండలం గిరిగామ్‌లో వ్యవసాయ విద్యుత్తు మోటార్లకు కరెంట్ సరఫరా చేసే నియంత్రిక అధిక లోడ్‌తో సరిగా పనిచేయడం లేదు. పంటలకు నీటి తడులు పెట్టలేని పరిస్థితి ఉండగా రెండు రోజుల కిందట గ్రామానికి వెళ్లిన ఏఈ మనోజ్‌కుమార్ ఈ సమస్య తెలుసుకున్నారు. ఎస్ఈ జైవంత్‌రావు చౌహాన్, డీఈ హరికృష్ణ దృష్టికి తీసుకెళ్లి రూ.5 లక్షల విలువైన కొత్త 63 కేవీ విద్యుత్తు నియంత్రికను కేటాయించారు. శుక్రవారం బిగించడంతో రైతుల సమస్య తీరింది. -న్యూస్‌టుడే, తాంసి

తీరొక్క పూలతో పేర్చి.. బతుకమ్మను కొలిచి


బతుకమ్మ ఎత్తుకున్న మాజీ జడ్పీటీసీ సభ్యురాలు చారులత రాఠోడ్


ఉట్నూరు మండలం నాగాపూర్‌లో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఆత్రం సుగుణ

ఉట్నూరు గ్రామీణం, ఉట్నూరు, నార్నూర్ న్యూస్‌టుడే : ఉట్నూరు మండలం నాగాపూర్, బీర్సాయిపేట, లక్కారం గ్రామాల్లో శుక్రవారం బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఆయా వీధుల కూడళ్ల వద్ద పాటలు పాడుతూ బతుకమ్మలు అర్ధరాత్రి వరకు ఆడిపాడారు. అనంతరం సామూహికంగా బతుకమ్మలను తీసుకుని గంగన్నపేట చెరువులో నిమజ్జనం చేశారు. ఆత్రం సుగుణతోపాటు పలువురు మహిళలు పాల్గొన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యురాలు చారులత రాఠోడ్ బతుకమ్మను ఎత్తుకొని మహిళలతో కలిసి ఆడిపాడారు. నార్నూర్ మండలంలోని భీంపూర్ దుర్గాదేవి వద్ద, అనంతరం సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి మాజీ జడ్పీటీసీ సభ్యురాలు చారులత రాఠోడ్ హాజరయ్యారు.

నాగోబాకు మెస్రం వంశస్థుల పూజలు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: ఆదివాసీల ఆరాధ్య దేవుడు నాగోబాకు మెస్రం వంశీయులు కొత్త పంటల పూజలు చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లో నివాసం ఉండే మెస్రం వంశం పెద్దలు శుక్రవారం కేస్లాపూర్ గ్రామానికి చేరుకుని నాగోబాకు ప్రత్యేక పూజలు చేసిన కొత్త పంటలను సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు, పటేల్‌లు మెస్రం చిన్ను, భాదిరావు, పూజారులు మెస్రం హన్మంత్‌రావు, మెస్రం కోసురావు, మెస్ర కోసు, ప్రధాన్ పాటు మెస్రం దాదేరావులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఇంద్రాయి దేవతకు మెస్రం వంశస్థులు మొక్కులు తీర్చుకున్నారు. దసర సందర్భంగా ఇంద్రాయి దేవతకు మొక్కులు తీర్చుకోవడం మెస్రం వంశస్థుల సంప్రదాయం. మెస్రం వంశస్థులతోపాటు ఆదివాసీ గోండులు, కొలాం గిరిజనులు తరలివచ్చారు. మెస్రం వెంకట్‌రావు, మెస్రం చిన్ను పటేల్‌ల ఆధ్వర్యంలో పూజారులు మెస్రం కోసురావు, మెస్రం హన్మంత్‌రావు, ప్రధాన్ మెస్రం దాదేరావు, కోత్వాల్ మెస్రం తిరుపతిలు జెండాను ఆవిష్కరించారు.


ఇంద్రవెల్లిలోని ఇంద్రాయి దేవతకు మొక్కులు తీర్చుకునే ముందు జెండాను ఆవిష్కరిస్తున్న మెస్రం వంశస్థులు

హిమతేజకు అభినందనలు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రానికి చెందిన కొడిమెల హిమతేజ రంజీ ట్రోఫీ పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన శిక్షణ పొందిన జేసీ అకాడమీ నిర్వాహకుడు, ఎన్ఐఎస్ క్రికెట్ శిక్షకుడు జయేంద్ర పటాస్కర్, క్రీడాకారులు శుక్రవారం అభినందనలు తెలిపారు.


కొడిమెల హిమతేజను అభినందిస్తున్న జేసీ అకాడమీ క్రీడాకారులు

దారంతా గుంతలు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో కొలువుదీరిన ఇంద్రాయి దేవత ఆలయానికి వేసిన సిమెంట్ రోడ్డును మురుగు నీరు ప్రవహించేలా తవ్వారు. దీంతో రోడ్డు ఇరుకుగా ఉండటంతో దసరా కోసం శుక్రవారం ఇంద్రాయి ఆలయానికి వచ్చి, పోయే భక్తులు ఇలా ఆటోలను నెడుతూ ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

డైట్ మైదానంలో దసరా ఉత్సవం


ఉట్నూరు గురుదత్త సాయికృష్ణ మందిర్‌లో తయారు చేసిన రావణుడి బొమ్మ

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి, కేవీఎస్ఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం సాయంత్రం దసరా ఉత్సవం నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రి పేర్కొన్నారు. శుక్రవారం డైట్ మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమ్మవారికి, శమీ చెట్టుకు పూజలు, రావణ బొమ్మ దహనం ఉంటుందన్నారు. సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఉత్తమంగా నిలిచిన వాటికి నగదు బహుమతులు అందిస్తామని వివరించారు. ప్రధాన కార్యదర్శి మాధవ్, కోశాధికారి సూర్యకాంత్ ఉన్నారు.

ఆదిలాబాద్ సాంస్కృతికం: దస్నాపూర్ మైదానంలో శనివారం దసరా వేడుకలు నిర్వహిస్తున్నట్లు హిందూ సమాజ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు హన్మాండ్లు పేర్కొన్నారు. సాయంత్రం కన్యకా పరమేశ్వరి మందిరంలో ప్రత్యేక పూజలు అనంతరం దస్నాపూర్ మైదానం వరకు శోభాయాత్ర ఉంటుందన్నారు. విశిష్ట అతిథిగా శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి, ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, పాలనాధికారి రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, కౌన్సిలర్లు లాలా మధుమన్నా జైస్వాల్, భరత్‌కుమార్, వ్యాపారవేత్త బజరంగ్‌లాల్ అగ్రవాల్ అతిథులుగా, ప్రధాన వక్తగా విశ్వ హిందూ పరిషత్ ఇందూర్ విభాగ్ ప్రముఖ్ కృష్ణ హాజరవుతున్నారని వివరించారు.

ఉట్నూరు గ్రామీణం: మండలంలో విశ్వహిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురుదత్త సాయి కృష్ణ మందిర్‌లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రావణుడి దిష్టి బొమ్మ సిద్ధం చేశారు.

నైట్‌ప్యాంట్ ఆర్డర్ చేస్తే.. చిరిగిన దుస్తులు

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ పట్టణం విద్యానగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న మహేందర్ అనే యువకుడు ఓ సామాజిక మాధ్యమంలో రూ.వెయ్యికి మూడు నైట్ ప్యాంటులు అనే ఆఫర్ ఉండటంతో ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టారు. శుక్రవారం పార్సిల్‌రాగా రూ.1090 చెల్లించాడు. పార్సిల్ తెరిచి చూడగా చిరిగిన గౌను రాగా ఖంగుతిన్నాడు. కొరియర్ బాయ్‌ను చరవాణిలో అడిగితే తాము ఏమీ చేయలేమని చేతులెత్తేశాడన్నారు.



రావణ దహనం వద్దు

నార్నూర్, న్యూస్‌టుడే : దసరా రోజున రావణ దహనం చేస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి గోవింద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమురంభీం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లార్డ్ బుద్ధా సొసైటీ, డా.అంబేడ్కర్ అసోసియేషన్, బార్సాముండా, కుమురంభీం యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమీకృత గురుకులం ఏర్పాటుకు కృషి

ఉట్నూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న సమీకృత ఆదర్శ గురుకుల పాఠశాలను ఖానాపూర్ నియోజకవర్గంలో ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. శుక్రవారం ఉట్నూరులో సమీకృత గురుకుల సాధన సమితి నాయకులు దాసండ్ల భూమన్న, లింగంపల్లి చంద్రయ్యలు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. గురుకులం ఏర్పాటుకు అవసరం అయ్యే భూసేకరణ, ఇతర ఏర్పాట్లు చేయించాలని విజ్ఞప్తి చేశారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానన్నారు. మహేందర్, కోట్నాక్ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వెడ్మబొజ్జుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



అర్లి-టీవాసుల ఆత్మీయ సత్కారం

భీంపూర్, న్యూస్‌టుడే: అర్లి-టి గ్రామానికి చెందిన యువతీయువకులు ఇంజనీరు, ఉపాధ్యాయ, కానిస్టేబుల్‌లు, మరికొందరు ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందారు. వారందరిని కనకదుర్గామండలి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆకాంక్షించారు. కామన్‌వార్ ప్రియ(ఇంజినీర్), సాక్షి(కానిస్టేబుల్), ప్రనూష(టీచరు), రాథోడ్ సమృద్ధి, మస్కపురె ప్రణీత్, రెడ్డి శివకుమార్‌లు ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందగా శబరిమాత ఉపాసకులు శివానందభారతి, గ్రామ పెద్దలు లస్మన్న, ఉల్లాస్ దేశ్‌ముఖ్, రాకేష్, గంగయ్య, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నవీన్, దుర్గామండలి సభ్యులు శ్రీనివాస్, లచ్చన్నలు వారిని సన్మానించారు.

పంచాయతీ కార్యదర్శికి..

మావల, న్యూస్‌టుడే: డీఎస్సీ ఫలితాల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన వాఘాపూర్ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను గ్రామస్థులు అభినందించారు. కార్యదర్శిగా గ్రామానికి సేవలందించి ఉద్యోగానికి రాజీనామా చేసిన వెళ్తున్న సందర్భంగా శాలువాతో సన్మానించారు.

పండగ వేళ.. వేతనాల వెత

బేల, న్యూస్‌టుడే:

పల్లెల శుభ్రతకు నిరంతరం పాటు పడుతున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఇప్పటికీ వేతనాలు అందడం లేదు. మూడు నెలల నుంచి వేతనాలు నిలిచిపోవడంతో కార్మికులు, వారి కుటుంబాలు అర్ధాకలితో అలమటించాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లావ్యాప్తంగా పంచాయతీ కార్మికులకు జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల వేతనాలు ఇప్పటి వరకు వారి ఖాతాల్లో జమ కావడం లేదు.

జిల్లాలో 1,342 మంది పారిశుద్ధ్య కార్మికుల ఎదురుచూపులు

జిల్లాలోని 18 మండలాల్లో 473 గ్రామపంచాయతీల్లో 1,342 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు రూ.9,500 చెల్లిస్తున్నారు. పారిశుద్ధ్యం, ట్రాక్టర్ల డ్రైవర్లు, పన్నుల వసూళ్లు, చెత్తసేకరణ, డంపింగ్‌యార్డు నిర్వహణ, మొక్కలకు నీళ్లుపట్టడం, నీటి సరఫరా తదితర విభాగాల్లో వీరు పనులు చేస్తుంటారు. నూతన పంచాయతీ చట్టం ప్రకారం వీరందరినీ మల్టీపర్పస్ వర్కర్స్‌గా పేర్కొంటున్నారు. ఉదయం 6 నుంచి రాత్రి వరకు పంచాయతీ కార్మికులు కష్టపడుతున్నారు.

ఇచ్చేదే అరకొర.. నెలల తరబడి జాప్యం

పారిశుద్ధ్య కార్మికులు పంచాయతీల్లో క్షణం తీరిక లేకుండా పని చేస్తారు. పెద్ద పంచాయతీల్లో అయిదు నుంచి పది మంది, చిన్నవాటిల్లో ఇద్దరు లేదా ముగ్గురు ఉంటారు. ఉదయం ట్రాక్టరుపై ఇంటింటికీ తిరుగుతూ చెత్త సేకరణ చేస్తున్నారు. తడి, పొడి చెత్త వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కాలువలు, పాఠశాలలు శుభ్రం చేయడం తదితర పనులు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి నెలా రూ. 9,500 ఇస్తుండటంతో ఆశతో కష్టమైనా ఇష్టంగా పనులు చేస్తూ పల్లెల శుభ్రతకు పాటుపడుతున్నారు. మొదట్లో నెలనెలా వేతనాలు రావడంతో ఉత్సాహంతో విధులు నిర్వర్తించిన కార్మికులు కొన్ని నెలలుగా సక్రమంగా రాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రభుత్వం ఇటీవల నిధులు విడుదల చేసిందని, త్వరలో కార్మికులకు అందేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు తెలిపారు.


కాలువ శుభ్రం చేస్తున్న కార్మికులు